www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY
విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 23 | 14-03-2022 | పుటలు : 4


## నన్నయకు మూడు అరుదైన గుర్తింపులు, పురస్కారాలు

**07.03.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీకి మూడు అరుదైన ఐ.ఎస్.ఓ. 14001:2015, ఐ.ఎస్.ఓ. 50001:2011 గుర్తింపులు మరియు జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్(జి.ఎస్.ఎ) గుర్తింపులు, అరుదైన పచ్చదన మరియు పర్యావరణ పురస్కారం లభించాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సోమవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో విశ్వవిద్యాలయ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిమ్(HYM) ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు ఐ.ఎస్.ఓ 14001:2015, ఐ.ఎస్.ఓ 50001:2011 మరియు జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్(జి.ఎస్.ఎ) గుర్తింపు పత్రాలను అందజేసారు. అలాగే అరుదైన పచ్చదన మరియు పర్యావరణ పురస్కారాన్ని ప్రదానం చేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉత్తమ పర్యావరణ పద్ధతులను పాటించినందుకుగాను ఐ.ఎస్.ఓ 14001:2015, ఉత్తమ శక్తి పరిరక్షణ పద్ధతులు పాటించినందుకుగాను ఐ.ఎస్.ఓ 50001:2011 పత్రాలు లభించాయన్నారు. విశ్వవిద్యాలయ విద్యా,పరిపాలన వ్యవహారాలలో పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన వసతులు,బాధ్యతలు, ప్రాధాన్యాలను కల్పిస్తున్నందుకు గాను జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్(జి.ఎస్.ఎ) గుర్తింపు లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటివరకూ ఏ విశ్వవిద్యాలయలకు,కళాశాలలకు దక్కని అరుదైన గుర్తింపు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి దక్కడం హర్షనీయమన్నారు. హైదరాబాద్ కు చెందిన హిమ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆలపాటి శివయ్య తమ బృందంతో విశ్వవిద్యాలయాన్ని పరిశీలించి ఈ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో భూగర్భ జల సామర్థ్యాలకు, పచ్చదన పెంపుదలలకు మరియు కాలుష్యనివారణ పాటించే పద్ధతులకుగాను నన్నయ విశ్వవిద్యాలయానికి పచ్చదన మరియు పర్యావరణ పురస్కారాన్ని హిమ్(HYM) ఇంటర్నేషనల్ సర్టిఫికెషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రధానం చేసారన్నారు. విశ్వవిద్యాలయానికి ఇప్పటికే ఐ.ఎస్.ఓ., ఎ.ఐ.సి.టి.ఇ., గుర్తింపులు సాధించామని వీటితో ప్రస్తుతం సాధించిన మూడు సర్టిఫికెట్లు మరియు అరుదైన పచ్చదన మరియు పర్యావరణ పెంపుదల పురస్కారాలు నాక్ గుర్తింపుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విశ్వవిద్యాలయానికి గుర్తింపుకు సహకరించిన ఆలపాటి శివయ్య, ఐ.క్యూ.ఎ.సి ఎక్సిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి మరియు వారి బృందాన్ని అభినందించారు. యూనివర్సిటీ ఐ.క్యూ.ఎ.సి ఎక్సిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామికి లీడ్ ఆడిటర్ గా శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా లీడ్ ఆడిటర్ సర్టిఫికెట్టును అందజేసారు. హిమ్(HYM) ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ జగన్నాథరావు నాయకత్వంలో చక్కని పరిపాలనతో పర్యావరణహితంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. దీనికి నిదర్శనంగా మూడు సర్టిఫికెట్లు మరియు అరుదైన పురస్కారాలు లభించాయన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని విశ్వవిద్యాలయం మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఐ.క్యూ.ఎ.సి ఎక్సిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య.వై.శ్రీనివాసరావు, డా.ఎన్.ఉదయభాస్కర్, సి.ఈ. ఎస్.లింగారెడ్డి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, అధికారులు,అధ్యాపకులు పాల్గొన్నారు.



నన్నయ వీసీకి సర్టిఫికెట్లు అందిస్తున్న హిమ్

### నైనా జైస్వాల్‌ని స్ఫూర్తిగా తీసుకొని

## అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నైనా జైస్వాల్

**09.03.22 (మీడియాసెల్)** నైనా జైస్వాల్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్య, క్రీడలు, సంస్కృతి, సాహిత్యం వంటి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, జక్కంపూడి విజయలక్ష్మి ఆయా రంగాల్లోన్ని మహిళా ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయడం ఆనందంగా ఉందని అన్నారు. వీసీ జగన్నాథరావు లాంటి మహనీయుని మార్గదర్శకంలో విశ్వవిద్యాలయ విద్యార్థులంతా చరిత్ర సృష్టించాలన్నారు. ప్రకృతి ప్రేమతో కట్టిపడేసే గోదావరి జిల్లాలు, మంచి చేయాలనే ఆలోచన గోదావరి జిల్లావాసుల రక్తంలోనే కాదు, తత్వంలో కూడా ఉంటుందని నమ్ముతున్నానని తెలిపారు. ధైర్యసాహసాలకు ప్రతీక అయిన గోదావరి కోడలు రాణీరుద్రమదేవిని ఆదర్శంగా తీసుకొని ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. గమ్యం స్థిరంగా ఉండాలని, మాట కచ్చితంగా గుర్తించుకోవాలని అప్పుడే విజయం మొగ్గు చూపిస్తుందని చెప్పారు. పుట్టుక, పేరు, గౌరవం ఇచ్చిన గోదావరి జిల్లాలను మర్చిపోవద్దన్నారు. తీసుకున్న నిర్ణయం తప్పు అయితే నాది, ఒప్పు అయితే మనది అనే మంచి మనిషి వీసీ జగన్నాథరావు అని తెలిపారు. ప్రతీ ఇంటికి కూతురు ఉండాలని, ఆడపిల్ల చిరునవ్వు శాశ్వతానందాన్ని ఇస్తుందన్నారు. తల్లిదండ్రులు దైవంతో సమానమని, గుడిలో లేని దైవం అమ్మ అని కొనియాడారు. యువతకు పెద్ద దెయ్యం టీవీ, చిన్న దెయ్యం సెల్ ఫోన్ అని వీటికి దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని తెలిపారు. ఇష్టంతో సాధన చేస్తే గెలుపు సాధ్యమవుతుందని, పాకిస్తాన్ లో మన జాతీయ జెండా రెపరెపలాడించినప్పుడు గెలుపు ఆనందాన్ని చవిచూసానన్నారు. చక్కని అవకాశాన్ని కల్పించిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు, గైడ్ ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడుకు, కోగైడ్ ఆచార్య ఎస్.టేకి కి కృతజ్ఞతలు తెలిపారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ సుస్థిరమైన రేపటి కోసం నేడు స్త్రీ, పురుషులు సమానంగా అభివృద్ధి సాధించాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవ థీమ్ ఉద్దేశాన్ని వివరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళాలు కీలక పాత్రను పోషిస్తున్నారని, విశ్వవిద్యాలయ పరిపాలనలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. సమాజంలో 50 శాతం ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖారలకు ఎదగాలని పురుషులతో సమానంగా స్త్రీలు ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. భారతదేశంలో యంగ్ పిహెచ్.డి స్కాలర్ గా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి నైనా జైస్వాల్ ఉండడం హర్షణీయమని అన్నారు. విద్యార్థులు ఇటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఆయా రంగాల్లో ప్రతిభను సాధించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మహిళాసభ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలోను, సంఘసంస్కరణలలోను పాటుపడిన మహిళామూర్తులను ప్రస్తావిస్తూ మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మహిళా దినోత్సవం సదర్భంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు అతిథుల చేతులు మీదిగా బహుమతులను అందజేసారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం, ఆంధ్రప్రదేశ్ మహిళాసభ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నేషనల్ టిటి ప్లేయర్ సుంకర నాగేంద్రకిషోర్, ఆదిత్య ఇన్సిట్యూట్ డైరెక్టర్ డా.ఎన్.సుగుణ, ఎన్.జి.ఓ టి.జయశ్రీ, విశ్రాంత ఉద్యోగిని పి.పద్మజవాణి, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నైనా జైస్వాల్ ను సన్మానించి అభినందిస్తున్న వీసీ

## సంపాదకీయం



# మిమ్మల్ని అడిగిన పుస్తకం!

సురక్షితమైన అరలో,జ్ఞాన పిపాసి అరచేతిలో,చదువుతూ చదువుతూ నిద్రలోకి జారుకున్న జిజ్ఞాసి గుండెల మీద.... ఇవే పుస్తకం ఉండాల్సిన చోట్లు.నచ్చిన పుస్తకం కొంటున్నప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో, కావాల్సిన పుస్తకం గ్రంథాలయంలో చేతికి దొరుకుతున్నప్పుడు కూడా అంతే ఆనందం కలుగుతుంది. అందులోనూ పునర్ముద్రణలేని అరుదైన పుస్తకం కనిపిస్తే ప్రాణం లేచొస్తుంది.పుస్తకప్రియులు కొన్నిటి కోసం పాత పుస్తకాల దుకాణం చుట్టూ తిరుగుతుంటారు.కొత్త వాటిని చిన్నబుచ్చే ఉద్దేశం కాదుగానీ పాత పుస్తకంలో ఓ దర్జా ఉంటుంది.ఆ పుస్తకాల సెల్ఫ్ కే అందాన్ని తెస్తుంది. కుర్రాళ్లంతా తలపండిన తాతగారితో సెల్ఫీ
దిగినట్టుంటుంది.

'తుపాకీ కంటే పెద్ద ఆయుధం పుస్తకమే' అంటారు లెనిన్. పుట్టినరోజు కానుకగా మీకు ఏం కావాలని అడిగితే పుస్తకమన్నారాయన.ఒక పిల్లాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి ఏమిటంటే 'పుస్తకమే' అంటారు చర్చిల్.

వెయ్యేళ్ల క్రితమో,ఐదారు దశాబ్దాల క్రితమో ఒక మహానుభావుడు తన జీవితానుభవాలను రంగరించి సృజనతో ఒక పుస్తకంగా, అది కథగానో,నవలగానో, కవిత్వంగానో రాసుకుని ఉంటాడు.కష్టపడ్డ సొమ్ముతోనో,తాతల ఆస్తి అమ్ముకునో అచ్చు వేయించి లోకానికి అందించి ఉంటాడు. అక్షరం మీద మమకారంతో ఏ ప్రచురణకర్తో సాహసం చేసి ఉంటాడు. కొన్నాళ్ళకి నీరు, నిప్పు,చెదలు తగిలి మాయమైనవి పోగా కాలపరీక్షకు తట్టుకుని మిగిలిన ప్రతులు వేళ్లమీద లెక్క కట్టేలా మిగులుతాయి.ఫలానా రచయిత ఆ పుస్తకం రాశాడని, అందులోంచి కొన్ని మాటలు తలపండిన పండితులు సభలో గుర్తు చేస్తారు. కొన్నాళ్ళకి అలా ఉటంకించేవారు కూడా కరువౌతారు. మెల్లగా ఆ పుస్తకం జ్ఞాపకాల్లోంచి మాయమై కొన్నాళ్ళకు శాశ్వత సమాధిని పొందుతుంది. ఇది తేలిగ్గా తీసుకునే విషయమా? గుండెలు బరువెక్కించే దుర్వార్త! సహజ మరణం కాదిది. సమాజం తరపున శ్రద్ధాంజలి కూడా కాదు.అక్షరాలా అశ్రద్ధాంజలి!!

నిజంగా ఒక అరుదైన పుస్తకం దొరికితే 'ఖరీదు కట్టే షరాబు లేదు' అన్నట్లుగానే ఉంటుంది.రంగువెలసినా బంగారు తల్లిలా తళ తళ మెరుస్తుంది. 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' పాత పుస్తక ప్రియులకు ఒక వరమనే చెప్పాలి. 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్పూర్' దీన్ని రూపొందించింది. ఇందులో చాలా తెలుగు పుస్తకాలు అప్లోడ్ చేశారు. మనసు ఫౌండేషన్ రాయుడుగారు ఎన్నో మంచి పుస్తకాల్ని తీసుకొస్తూ ఒక ప్రయత్నం చేస్తున్నారు. అరుదైన పుస్తకాల్ని పిడిఎఫ్ చేసి పెడతారు. మనకు అవసరం లేదనుకున్న పుస్తకం మరొకరికి అవసరమవుతుంది. రాజమహేంద్రి గౌతమీ గ్రంథాలయంలో ఎన్నో అరుదైన పాఠ్యపుస్తకాలను 'తెలుగు వెలుగు'అరిపిరాల నారాయణరావుగారు స్కాన్ చేయించి పిడిఎఫ్ ప్రతులుగా మార్పించే భద్రతా ఉద్యమంలో ఉన్నారు. తెలుగుతల్లి తోటమాలి లంకా సూర్యనారాయణగారు సేకరించిన గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయం ఎంత గొప్పదో. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి దాతలు ఇచ్చిన పదివేలకుపైగా పుస్తకాల్ని నన్నయభారతి పేరుతో ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు ఉపకులపతి మొక్కా జగన్నాథరావుగారు.పుస్తక పఠనాన్ని, పుస్తక దానాన్ని ప్రోత్సహించే ఉద్యమాలివి.

పుస్తకాలకోసమే టెలిగ్రామ్, వాట్స్ యాప్ గ్రూపులు బోలెడంత సేవ చేస్తున్నాయి.మాకు ఈ పుస్తకం కావాలని అడిగితే కాసేపట్లో మొబైల్లో ప్రత్యక్షమౌతుంది.

పుస్తకాలు కాలసాగర తీరాన దారి చూపే లైట్ హౌసులని,అనర్ఘ కోశాగారాలని,ఆత్మకి ఔషధాలనీ అంటారు పొన్నపల్లి శ్రీరామారావు గారు. ఏదేమైనా కొత్త పుస్తకం కొత్త స్నేహితుడయితే పాత పుస్తకం పాత బంధువే! పుస్తకాన్ని మనం వెతకడం కాదు.అదే మనల్ని వెతుకుతోంది. ఓసారి మీరు కనిపించండి.

# నన్నయ భారతి, నన్నయ స్టడీ సెంటర్‌ను ప్రారంభించిన వీసీ


నన్నయభారతి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ


తిలక్ సాహిత్య భారతి ఆవిష్కరణ

దాతలు సమర్పించిన పుస్తక భాడాగారం "నన్నయ భారతి", గోదావరి జిల్లాల విజ్ఞాన సమాచారం వేదికగా "నన్నయ అధ్యయన కేంద్రం"ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నన్నయ భారతి, నన్నయ స్టడీ సెంటర్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై దాతలు సమర్పించిన పదకొండు వేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన నన్నయభారతి, నన్నయ అధ్యయన కేంద్రాలను ప్రారంభించి, సందర్శించారు. అన్నమయ్య గ్రంథాలయం గుంటూరు నుండి మోదుగుల రవికృష్ణ, తాతినేని మెహర్ ప్రసాద్, ఎం.ఎస్.సూర్యనారాయణలు బహూకరించిన పుస్తకాలను వీసీ స్వీకరించారు.నన్నయ అధ్యయన కేంద్రంలో తొలిసారిగా "తిలక్ సాహిత్య భారతి" అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను డా.రంకిరెడ్డి రామ్మోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ సంపాదకులుగా తయారుచేసిన సంచికను వీసీ ఆవిష్కరించారు. నన్నయ అధ్యయన కేంద్ర సమాచారాన్ని ఉపయోగించుకొని గోదావరి జిల్లాల రాజకీయాలపై మోనోగ్రాఫ్ తయారు చేయమని రాజనీతిశాస్త్ర ఆచార్యులు డా.బి.వి.బాలకృష్ణకు వీసీ సూచించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ వివేకంతో, రాజరాజనరేంద్రుని ధైర్యంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అవకాశం లభించిందన్నారు. విద్యార్థుల శ్రేయస్సే తనకు ముఖ్యమని, గురువులు విద్యార్థులను పరిశోధనలవైపు నడిపించాలన్నారు. నన్నయవాణి, నన్నయ విజ్ఞాన భారతి, నన్నయ అధ్యయన కేంద్రం, నన్నయభారతి, సైకలాలిజకల్ కౌన్సిలింగ్ సెంటర్, ఓపెన్ ఎయిర్ క్లాస్ రూమ్స్ వంటి వినూత్న విధానాలతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన ఎ.ఐ.సి.టి.ఇ., ఐ.ఎస్.ఓ గుర్తింపులు తీసుకువచ్చామని నాక్ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. దాతలు సమర్పించిన పదకొండు వేల పుస్తకాలను సేకరించిన డోనెటెడ్ వింగ్ కోఆర్డినేటర్, తెలుగుశాఖ అధ్యాపకులు డా.తలారివాసును అభినందించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆయా విభాగాలకు చెందిన అన్ని పుస్తకాలను సెర్చ్ బుక్ డేటా బేస్‌గా తీర్చిదిద్దాలన్నారు. గోదావరి జిల్లాలతో పాటు ఆయా ప్రాంతాల్లోని దాతలు నన్నయభారతి డోనెటెడ్ వింగ్ కు పుస్తకాలను బహుకరించాలని కోరారు.

నన్నయవాణి పత్రికను విజయవంతంగా నిర్వహిస్తున్న ఎడిటర్స్ డా.తలారివాసు, పి.ఆనంద్‌లను వీసీ సత్కరించి అభినందించారు. తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య పర్వతనేని సుబ్బారావు మాట్లాడుతూ తన వద్ద ఉన్న పదిహేనువందల గ్రంథాలను విశ్వవిద్యాలయానికి అందజేస్తానన్నారు. దాతలు, విద్యావేత్తలు, మేధావులు, సొంత గ్రంథాలయాలను కలిగిన వారు గ్రంథాలను విశ్వవిద్యాలయాలకు అందించాలని, తద్వారా విద్యార్థులకు తరతరాలుగా జ్ఞానం అందుతుం దన్నారు. డోనెటెడ్ బుక్స్ వింగ్ కోఆర్డినేటర్ డా.తలారివాసు మాట్లాడుతూ తాను దాతల యొద్ద నుండి సేకరించిన వేలాది గ్రంథాలకు విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేక స్థానం కల్పించి, డోనెటెడ్ బుక్స్ వింగ్ ను స్థాపించిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు ప్రత్యక కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రశంసా జ్ఞాపికను అందజేసి సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఎఫైర్స్ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరి, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, లైబ్రేరియన్ డా.తెర్లి సింహాచలం, ఆచార్య పర్వతనేని సుబ్బారావు, రంకిరెడ్డి రామ్మోహనరావు, తెలుగు శాఖాధిపతి డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు నుండి వచ్చిన గ్రంథాలను బహూకరిస్తున్న డా.గోపాలకృష్ణ.


గ్రంథ వితరణ చేస్తున్న తాతినేని మెహర్ ప్రసాద్


గోదావరి మోనోగ్రాఫ్ రచయిత డా.బి.వి.బాలకృష్ణ.



వీసీ ను సన్మానిస్తున్న అధికారులు.

# నాబార్డ్ చైర్మన్‌ను కలిసిన నన్నయ అధికారులు


నాబార్డ్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నన్నయ అధికారులు

**09.03.22** (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆదేశాల మేరకు యూనివర్సిటీ అధికారులు నాబార్డ్ చైర్మన్ జి.ఆర్.చింతల ను కలిసారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీ అయిన డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీకి విచ్చేసిన నాబార్డ్ చైర్మన్ జి.ఆర్.చింతల ను నన్నయ యూనివర్సిటీ ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వసతుల కల్పన అభివృద్ధి రీసెర్చ్ ప్రాజెక్టులలో నాబార్డ్ సహకారం ఎంతో అవసరమని కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసే నాబార్డు గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని అన్నారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రగతి నివేదికను తెలియజేస్తూ, విశ్వవిద్యాలయాన్ని సందర్శించాలని కోరారు. ఈ భేటీలో నన్నయ అధికారులతోపాటు డా. వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జానకిరామ్ పాల్గొన్నారు.

## మంచి మాట



మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అన్నప్పుడు కొంచెం కూడా ఆలోచించకుండా 'పుస్తకం' అని చెబుతాను.


- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

## ఎం.ఎస్.ఎన్. క్యాంపస్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్యాంపస్ మహిళా విభాగ కోఆర్డినేటర్ కె. అనిలాంబిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం. కమల కుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మనం వివిధ దినోత్సవాలని జరుపుకుంటూనే ఉంటాం కానీ అంబేద్కర్ చెప్పినట్లు సమాజ అభివృద్ధి అనేది మహిళా అభివృద్ధి అనే కొలమానంపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుచేశారు. మహిళలు ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగస్థులు ఎప్పుడూ మన చుట్టూ ఉన్న సమాజాన్ని గమనిస్తూనే ఉండాలి. వాటికి అనుగుణంగా మనం జాగ్రత్తపడాలని, ఎందుకంటే మహిళా భద్రత ఇండెక్స్ 2021 ప్రకారం భారతదేశం 148వ ర్యాంక్ ని కలిగి ఉందని దిశా, నిర్భయ లాంటి ఎన్నో చట్టాలు చేసినప్పటికీ ఇంకా మహిళల మీద ఏదో విధంగా అభద్రత కలుగుతూనే ఉందని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన పురుష సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పిదప మహిళా అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి పురుష సిబ్బంది ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కె.హారిక, ఎం. సత్యనారాయణ, నాని బాబు ,డా.అజయ్ రతన్, హరి బాబు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో మహిళా దినోత్సవ వేడుకలు




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ మొదటి యూనిట్, మహిళా సాధికారత క్లబ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు, మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురుష అధ్యాపకులందరూ మహిళల ప్రాముఖ్యాన్ని, వారి నాయకత్వానికి ప్రతిస్పందన మరియు స్థిరమైన భవిష్యత్తు కోసం వారి సహకారం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం థీమ్ "బ్రేక్ ది బయాస్" లింగ సమానత్వాన్ని వివరించే ప్రాముఖ్యతను చూపడానికి సంతకం బోర్డుపై మహిళా అధ్యాపకులు మరియు విద్యార్థులు సంతకాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జె.కృష్ణంరాజు గారు ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ తాడేపల్లిగూడెం కాంపస్ ముఖ్య అతిథిగా, మకార్యక్రమంలో మహిళా సాధికారత క్లబ్ అధ్యాపక సలహాదారు శ్రీమతి పి.అరుణ, క్లబ్ ఛైర్మన్ కె.దమయంతి, కో-ఛైర్మన్ కె. ప్రభాస్ ,అన్నివిభాగాల కోర్స్ కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరేడ్‌కు హాజరైన ప్రమీలకు వీసీ అభినందనలు



రిపబ్లిక్ డే పెరేడ్ 2022 కు హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల ఏ.ఎస్.డి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ అటానమస్ కాకినాడ ఫిజికల్ డైరెక్టర్ లెఫ్ట్ నెంట్ జి.ప్రమీలారాణిని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. గురువారం వీసీ కార్యాలయంలో ప్రమీలారాణిని అభినందించిన వీసీ వివరాలను తెలియజేశారు. రిపబ్లిక్ డే పెరేడ్ 2022లో రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల డైరెక్టరేట్ కంటెంజెంట్ లేడి అసోసియేట్ ఎన్.సి.సి. ఆఫీసర్ గా ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. ఎన్.సి.సి. లో ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసిన అనంతరం రిపబ్లిక్ డే పెరేడ్ కు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించారని తెలియజేసి అభినందించారు.

## సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ ఈసీ మెంబర్‌గా డా.పి.విజయనిర్మల

### అభినందించిన వీసీ జగన్నాథరావు


విజయనిర్మలకు నియమకపత్రాన్ని అందించి అభినందిస్తున్న వీసీ

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పాలక మండలి సభ్యురాలుగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ జూవాలజీ విభాగాధిపతి డా.పాంగి విజయనిర్మల నియమితులయ్యారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ లో సోమవారం వీసీ జగన్నాథరావు ఈసీ నియామక పత్రాన్ని విజయనిర్మలకు అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విజయనిర్మల విశాఖ ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామమైన పెదబయలు మండలంలో పుట్టి పెరిగి ఉన్నత విద్యనభ్యసించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జూవాలజీ విభాగాధిపతిగా ఎదిగారని అన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలు సంయుక్త కార్యక్రమాలు, పరస్పర సహకారం, విద్య పరిశోధన అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మారుమూల, గిరిజన ప్రాంతాల విద్యార్థులు, అధ్యాపకులు మరింత అభివృద్ధి సాధించాలని తెలియజేసారు. డా.పి.విజయనిర్మల మాట్లాడుతూ తన ప్రాంతంలో విశ్వవిద్యాలయానికి పాలక మండలి సభ్యురాలిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. తనను ప్రోత్సహిస్తున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య టి.వి.కట్టమణి, నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలియజేసారు. తనపై ఉన్న బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, అధికారులు, అధ్యాపకులు విజయనిర్మలకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, తదితరులు పాల్గొన్నారు.






ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజ్ విద్యార్థి కె. పవన్ కుమార్ కాంస్య పతకం సాధించారు.

## ఆక్వాకల్చర్ విభాగం పూర్వ విద్యార్థులు సహకారం



ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి, ఆక్వాకల్చర్ విభాగం పూర్వ విద్యార్థులు ( మొదటి బ్యాచ్ విద్యార్థులు 2016-18 ) ఇటీవల ఆక్వాకల్చర్ విభాగంలో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన Ecobiological Studies of Aquatic Ecolyftems - unitకు సహాయం అందించేందుకు అవంతి ఫీడ్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ నందు సీనియర్ టెక్నికల్ సేల్స్ ఆఫీసర్స్ (Sr.T.SO) పని చేస్తున్న సిహెచ్ .హేమసుందర్ మరియు యు.వెంకటేశ్‌లు ముందుకు వచ్చారు. దీనిలో భాగంగా PL 10 ష్రింప్ సీడ్ (1000 Number) తో పాటుగా 40 kg అగ్రికల్చర్ లైమ్ , అవంతి ప్రాబమాటిక్స్ అంత మినరల్స్ , అవంతి ఫిడ్ ఆడిటివ్స్ , అవంతి ఫీడ్ ను డిపార్ట్ మెంట్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వాకల్చర్ విభాగాధిపతి డా.కె.రమణేశ్వరి, డా.డి. శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


ఖోఖో క్రీడాకారులకు శుభాకాక్షలను తెలియజేస్తున్న వీసీ

**09.03.22** (మీడియాసెల్) ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు అన్ని కళాశాలలు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత నివ్వాలని, క్రీడాకారులను విశ్వవిద్యాలయం ప్రోత్సహిస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలోని గురువారం ఖోఖో ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ జగన్నాథరావు ఆయా కళాశాలల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల నుండి ఖోఖో ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కొరకు 12 టీమ్స్ వచ్చాయని వీటిలో ప్రతిభ కనపరచిన వారిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఖోఖో ఉమెన్ పోటీలకు పంపిస్తారని చెప్పారు. క్రీడాకారులు ఉత్సాహంతో క్రీడల్లో రాణించాలని తెలియజేసారు. విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడాకారులకు కావల్సిన కనీస వనరులను, వసతులు సమకూర్చాలని చెప్పారు. మారుమూల ప్రాంతాలల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసే విధంగా ఫిజికల్ డైరెక్టర్స్ పని చేయాలన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తూ, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే విధంగా కళాశాలలు ముందుకు వస్తే విశ్వవిద్యాలయం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలియజేసారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ఎగువ స్థాయి పోటీలలో ప్రతిభకనపరచి విశ్వవిద్యాల యానికి మంచి పేరుప్రఖ్యాతులను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ డా.బి.రామ్ గోపాల్, అబ్జర్వర్లు, పీడీలు పాల్గొన్నారు.

## నన్నయ అధ్యాపకుడు రామకృష్ణకు డాక్టరేట్



**08.03.22** (మీడియాసెల్) ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు వినకోటి రామకృష్ణ కృష్ణా యూనివర్శిటీ నుండి పిహెచ్.డి. డాక్టరేట్ అందుకున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. మంగళవారం వీసీ కార్యాలయంలో రామకృష్ణ డాక్టరేట్ ఉత్తర్వులు అందజేసిన వీసీ జగన్నాథరావు వివరాలను తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యావిభాగంలో సహాయాచార్యులుగా పనిచేస్తున్న రామకృష్ణ సెకండరీ విద్యార్థుల మానసిక ఆరోగ్యం, పరీక్షలపట్ల ఆందోళన, తల్లిదండ్రులు విద్యార్థుల సంబంధాలు, విద్యార్థుల ప్రగతి పట్ల సంబంధం అనే అంశంపై పరిశోధన చేసారని తెలిపారు. ఎంఏ, ఎంఎస్సి , ఎంఈడీ, ఎంఫిల్, ఏపీసెట్ , యూజీసీ నెట్ వంటి అర్హతలు సాధించారని రామకృష్ణను వీసీ అభినందించారు. రామకృష్ణ పిహెచ్.డి. తీసుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## క్రీడల్లో నన్నయ ప్రతిభను కనపరచాలి


రైటప్: ఖోఖో విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న వీసీ

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనపరచి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని చాటిచెప్పాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలోని శుక్రవారం ఖోఖో ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కం యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ముగింపు సమావేశానికి వీసీ జగన్నాథరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతల వివరాలను తెలియజేసారు. వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఖోఖో ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని అభినందించారు. ఉభయగోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి 150 మంది మహిళా క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనపరిచారని చెప్పారు. మొదటి స్థానం ఎస్.ఎస్.ఆర్.గవర్నమెంట్ కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గోపన్నపాలెం, రెండవ స్థానం ఎస్.కె.ఎస్.డి.మహిళా కళాశాల తణుకు, మూడవ స్థానం సి.ఆర్.రెడ్డి కాలేజ్ ఏలూరు, నాలుగవ స్థానం ఎ.ఎస్.డి.కాలేజ్ కాకినాడ కైవసం చేసుకున్నాయన్నారు. వీటిలో ఎక్కువ ప్రతిభను కనపరచిన 12 మందిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి ఈ నెల 17 నుండి 20వ తేదీ వరకు వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఖోఖో ఉమెన్ పోటీలకు పంపిస్తారని చెప్పారు. విజేతలను వీసీ అభినందించి ట్రోఫీలను అందజేసారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో సత్తాచాటాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ డా.బి.రామ్ గోపాల్, అబ్జర్వర్లు, పీడీలు పాల్గొన్నారు.



## సైకాలజీ విభాగంలో మహిళా దినోత్సవం.

కేక్ కట్ చేస్తున్న అధ్యాపకురాలు డా.కృష్ణ భవాని.


# ఫ్రెషర్స్ పార్టీ

## (డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్)









వాడిపోనిది స్నేహమొక్కటే
వీడిపోనిది నీడ ఒక్కటే
హద్దంటూ లేనే లేనిదీ ఫ్రెండ్ షిప్ ఒక్కటే
కష్టమొచ్చినా నష్టమొచ్చినా
మారిపోనిది ఫ్రెండ్ ఒక్కడే
కాలేజీ స్నేహం ఎపుడు అంతం కానిదే....







# ఉత్సాహంతో బిటెక్ ఫ్రెషర్స్‌కు ఆహ్వానం





వీసీకి జ్ఞాపకను అందిస్తున్న విద్యార్థులు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ బిటెక్ సెంకడ్ ఇయర్ విద్యార్థులు ఉత్సాహంతో ఫ్రెషర్స్ కు ఆహ్వానం పలికారు.యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన బిటెక్ ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ప్రత్యేక ప్రాధాన్యాన్నిచ్చామని ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపును తీసుకువచ్చామన్నారు. స్టూడెంట్ క్లబ్స్ ఏర్పాటు, స్పెషల్ స్పోర్ట్స్ వింగ్, వినిమయ, వినూత్న, వినియోగ్ వంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీస్తున్నామన్నారు. నూతనంగా బిటెక్ లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలికి,అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ లేకుండా చర్యలు తీసుకున్నామని, చక్కని వాతావరణంలో ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యను పూర్తి చేయాలని తెలియజేసారు.ఆయా ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను గురువులు సొంత పిల్లలుగా మార్గనిర్దేశం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు వీసీ అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.వీసీ మార్గదర్శకంలో యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ సాధించిన విజయాలను ప్రస్తావించారు.ఆయా కార్యక్రమాలు, ప్రాజెక్టులలో విద్యార్థులు కనపరచిన ప్రతిభను వివరించారు. ఓ.ఎస్.డి.ఆచార్య ఎస్.టేకి, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు బిటెక్ విద్యార్థులకు స్వాగతం పలికి శుభాకాంక్షలను తెలియజేసారు. తరువాత వీసీని సన్మానించి జ్ఞాపికను అందజేసారు. అనంతరం విద్యార్థులు నూతనోత్సాహంతో సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.











ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in